## అన్నం పరబ్రహ్మ స్వరూపం

• శ్రీనగర్ సీనియర్ మాజీ ఎంపిటీసి కొల్లు పద్మ



కొత్తగూడెం, సెప్టెంబరు15(కెరటం ప్రతినిధి)

అంగరంగ వైభవంగా జరుగుతున్న విజయ విఘ్నేశ్వరుడి నవరాత్రుల పూజలు ఈరోజు తొమ్మిదొవ రోజు శ్రీనగర్ పంచాయతీ ఇందిరానగర్ లో వినాయక మండపం దగ్గరకు విచ్చేసిన భక్తులకు శ్రీనగర్ సీనియర్ మాజీ ఎంపీటీసి కొల్లు పద్మ విచ్చేసి అత్యంత రుచికరమైన అన్న ప్రసాదం వడ్డించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొత్తం మహిళలే ముందుండి దేనిలో అయినా సరే మేము తగ్గేదెలే అన్నట్లుగా చాలా ఘనంగా తొమ్మిది రోజులు పూజలు నిర్వహించారని తెలిపారు. వారికి వారి కుటుంబాలకు వారితోపాటు మనకు ఆ విజయ విఘ్నేశ్వరుడి దివ్యమైన ఆశీస్సులు ఎల్లప్పుడు పరిపూర్ణంగా ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీనగర్ సీనియర్ మాజీ ఎంపీటీసీ కొల్లు పద్మ, విచ్చేసి అన్న ప్రసాదం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మన్నే నాగశ్రీ, శారదా, రాధికా, స్రవంతి, రాజమ్మ, సుగుణమ్మ, చంద్రకళ, నర్సమ్మ, కళ్యాణి, మహా లక్ష్మీ, తదితరులు పాల్గొని విజయవంతం చేసారు.

## వెంకటమ్మకు ఘన నివాళి..



కొత్తగూడెం, సెప్టెంబరు15(కెరటం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం రామవరం ప్రాంతానికి చెందిన మాల మహానాడు మహిళ జిల్లా కార్యవర్గ సభ్యురాలు విజయలక్ష్మి తల్లి మీసాల వెంకటమ్మ గత కొంతకాలంగా క్యాన్సర్ తో బాధపడుతూ అనారోగ్య కారణాల రీత్యా ఆదివారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాల మహానాడు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పూల.రవీందర్ రామవరం మాల మహానాడు నాయకులతో కలిసి విజయలక్ష్మి స్వగృహానికి చేరుకొని వారి తల్లి మీసాల. వెంకటమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియపరచి వారి కుటుంబానికి మాల మహానాడు అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పగిడిపల్లి.శ్రీకాంత్, జట్టి మోహన్, కోరి మీ.సురేష్,మైల,వేణు, కనకయ్య,వసుంధర, మూర్తి, రామస్వామి తదితర రామవరం మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లిని అధికసంఖ్యలో దర్శించుకున్న భక్తులు

సెప్టెంబరు15(కెరటం ప్రతినిధి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:పాల్వంచ మండలం, కేశవాపురం - జగన్నాథపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) నందు ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఉదయం నుండే పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండేకాక ఇతర జిల్లాల నుండి భక్తులు తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించినారు. మరియు అన్నప్రాశనలు, వాహన పూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, కనుములు, తదితర మొక్కులను చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదములను స్వీకరించారు.

# ప్రతిపల్లెలో ఎర్రజెండా రెపరెపలాడాలి






- సమస్యలులేని గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం
- గ్రామీణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు నిరంతర కృషి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని
- కూనంనేని సమక్షం చిమ్నాతండా గ్రామం నుంచి 60 కుటుంబాలు సిపిఐలో చేరిక

కొత్తగూడెం, సెప్టెంబరు15(కెరటం ప్రతినిధి)

పల్లెప్రజలకు కావాల్సిన కనీస మౌలిక వసతుల కల్పనకు నిరంతర కృషి జరుగుతోందని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిరంతర కృషి జరుగుతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పునరుద్ఘాటించారు. సుజాతనగర్ మండలంలోని పాత అంజనాపురం గ్రామపంచాయతి చిమ్నాతండాలో కూనంనేని సమక్షంలో 60 కుటుంబాలకు చెందినవారు సిపిఐలో చేరారు. వీరికి కూనంనేనితోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ఎర్ర కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటుచేసిన గ్రామస్థాయి సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి గ్రామాన్ని అభిరుద్ధివైపు ఉరకలు వేయిస్తానని, రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి జాగురుతోందన్నారు. ప్రతి పల్లెలో ఎర్ర జెండా రెపలాడటం ఖాయమని, నియోజకవర్గంలో సిపిఐకి ఎదురులేదన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు ప్రజలకు సేవలందించడం ద్వారా పార్టీని మరింత విస్తరించాలని సూచించారు. కాగా గ్రామానికి చెందిన బోడ రమేష్, అజ్మీర కళ్యాణ్, సీతారాం, అమ్ము, భూక్యా రమేష్, తేజావత్ రాజేష్, వెంకటేష్, బానోత్ కుమార్, హజ్జి తదితరు 60 కుటుంబాలు సీపీఐలో చేరినవారిలో వున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్య దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, మండల నాయకులు తాళ్లూరి పాపారావు, పొదిల శ్రీనివాస్, ధర్మారావు, కొమారి కృష్ణ, మల్లేష్, గోపి, భాగం రామ్మోహనరావు, బండి రమేష్, చిన్న కృష్ణ, ఊకె నాగేశ్వర్ రావు, బాలు, సురేష్, పోటు వెంకటేశ్వర్ రావు, జాన్ విక్టర్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంబంధాలు మెరుగుపడేందుకు ఉత్సవాలు దోహదం

- సంతోషంగా నవరాత్రులు జరుపుకోవాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని





కొత్తగూడెం, సెప్టెంబరు15(కెరటం ప్రతినిధి)

పండుగలు, ఉత్సవాలు ప్రజా సంబంధాలు మెరుగుపడేందుకు దోహదపడతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉత్సవ కమిటి ఆహ్వానం మేరకు పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మంటపాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గణేష్ ఉత్సవాలు, దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఏర్పాటు వల్ల ఆ ప్రాంత ప్రజల మధ్య సంబంధాలు మెరుగుపడతాయన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోకుండా నేటితరం యువకులు రెట్టిపు స్థాయిలో తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్థిక వనరులను సమకూర్చుకొని ప్రజల్లో ఆధ్యాత్మికతను నింపుతూ తద్వారా సమాజంలో శాంతికి దోహదపడుతున్న కమిటీల కృషి హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరు మన ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, వాసిరెడ్డి మురళి, నేరెళ్ల సమాఖ్య, పిడుగు శ్రీనివాస్, లగడపాటి రమేష్,గడ్డం ప్రభాకర్, బోయిన విజయకుమార్, యూసుఫ్, నేరెళ్ల రమేష్, సతీష్బ, అస్మద్ ఖాన్తు, సురేష్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలి

## 18 న చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి

సెప్టెంబరు15(కెరటం ప్రతినిధి)

తెలంగాణ భవన ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు అమలు చేస్తున్న పథకాలను ప్రవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని భవన నిర్మాణ కార్మిక నాయకులు డిమాండ్ చేశారు.కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటరు అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బిఓసి జిల్లా కన్వీనర్ రావూరి ఉపేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎదులపురం గోపాలరావు,ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు గౌని నాగేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు అమలు చేసే ప్రమాద మరణం,సహజ మరణం,శాశ్వత అంగవైకల్యం,పాక్షిక అంగవైకల్యం మొదలగు వాటిని ప్రవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లకు పిలిచిందని తక్షణమే ఈ టెండర్లను రద్దు చేయాలని వారి డిమాండ్ చేశారు.ప్రమాద మరణానికి 10 లక్షల రూపాయలు చెల్లించాలని సహజమరణానికి 5 లక్షల రూపాయలు వివాహం ప్రసూతి ప్రోత్సాహకాలను లక్ష రూపాయలకు పెంచాలని వారి సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు కనీస పెన్షన్ 5000 రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న ఏ ఎల్ ఓ పోస్టులను భర్తీ చేసి నిర్మాణ కార్మికులకు సత్వరమే పథకాల అందే విధంగా కృషి చేయాలని, నియోజకవర్గ కేంద్రాల్లో ఏ ఎల్ ఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న కలెక్టరేట్ కార్యాలయం ముందు జరుగుతున్న ధర్నా కార్యక్రమంలో కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## ఆత్మీయుల నడుమ వైభవంగా...

# రాయల శాంతయ్య జన్మదిన వేడుకలు










కొత్తగూడెం, సెప్టెంబరు15(కెరటం ప్రతినిధి)

ఆత్మీయుల నడుమ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బి బ్లాక్ అధ్యక్షులు, లయన్ రాయల శాంతయ్య జన్మదిన వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్ ను రాయల శాంతయ్య కట్ చేయగా, ఆత్మీయులు, అభిమానులు ఆయనకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యాలయంలో లయన్స్ క్లబ్ సి.హెచ్.వి శివప్రసాద్, గబ్బెట రాజయ్య, బిసి సెల్ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు, వడ్డెర సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వర్లు, ఏలూరి రాజేష్, ఆత్మీయులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి విఘ్నాలు లేకుండా నిమజ్జనం

- అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక పకడ్బందీ ఏర్పాట్లు
- అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనంలో పాల్గొనాలి
- కొత్తగూడెం గణేష్ కమిటీ అధ్యక్షులు కె.వి.రంగాకిరణ్
- గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజా సామాగ్రి పంపిణి

కొత్తగూడెం, సెప్టెంబరు15(కెరటం ప్రతినిధి)

ఈ నెల 17వ తేదీన నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున్న జరగనున్న నేపథ్యంలో ఎలాంటి విఘ్నాలు కలిగించకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని, అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కె.వి. రంగాకిరణ్ తెలిపారు. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మండపాలకు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పట్టణంలోని భజన మందిరం సమీపంలో ఉన్న వివేకానంద స్కూల్ లో పూజా ద్రవ్య సామాగ్రి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కె.వి. రంగాకిరణ్ మాట్లాడుతూ.. తొమ్మిది రోజులు నవరాత్రులు ఘనంగా ముగించుకుని అనంతరం అనంత పద్మనాభ చతుర్దశి రోజూ 17వ తేదీన గణనాథుడు నిమజ్జనం జరుపుకుంటాడని వివరించారు. ఆ రోజూ సాయంత్రం 3.00 గంటలకు ప్రకాశం స్టేడియంలో ప్రత్యేక పూజా కార్యక్రమం ఉంటుందని, జిల్లా ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలు నాయకులు, ప్రముఖులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సూపర్ బజార్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన భారీ వేదిక వద్ద జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే వినాయక్ విగ్రహాలకు తుది వీడ్కోలు పలకనున్నట్లు చెప్పారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే నిమజ్జనం కార్యక్రమంలో మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎలాంటి ఆటంకాలు సృష్టించకుండా సజావుగా గణనాథుడికి వీడ్కోలు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి దారా రమేష్, భజరంగ్ దళ్ జిల్లా సంయోజక అధ్యక్షులు చింటూ తదితరులు పాల్గొన్నారు.



